ప్రజాశక్తి

శనివారం 12 అక్టోబర్ 2024 8 పేజీలు


కర్నూలు నంద్యాల





దసరాకు ధరాఘాతం..!

- నిత్యావసరాల ధరలతో సామాన్యుల బెంబేలు
- పండగ పూటా భక్ష భోజనం కష్టమే



ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

దసరాకు సామాన్యులకు ధరాఘాతం తప్పడం లేదు. పెరిగిన ధరలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పండగ పూట భక్ష భోజనం కష్టంగా మారింది. చాలా మంది ఉన్న దాంట్లోనే సర్దుకుని పండగను చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది...

సామాన్యులకు దసరాకు ధరాఘాతం తప్పడం లేదు. దసరా సందర్భంగా జిల్లాలో చాలా మంది భక్షాలను చేసుకుంటారు. నిత్యావసర ధరలకు రెక్కలు రావడంతో సామాన్యులకు పండగ పూట భక్ష భోజనం కష్టంగా మారింది. వాటికి ఉపయోగించే నిత్యావసరాల ధరలు కూడా అధికంగానే ఉన్నాయి. కర్నూలు నగరంలో కిలో శనగ బేడలు రూ.110, బెల్లం రూ.70, మైదా రూ.45, 100 గ్రాముల నెయ్యి రూ.80గా ఉంది. ఆదోనిలో కంది బేడలు కిలో రూ.180, శనగ బేడలు రూ.120, కిలో మైదా పిండి రూ.50, బెల్లం రూ.60 ఉన్నాయి. నంద్యాలలో కిలో శనగ బేడలు రూ.105, బెల్లం రూ.70, మైదా రూ.45, 100 గ్రాముల నెయ్యి రూ.80గా ఉంది. ఆత్మకూరులో కిలో శనగ బేడలు రూ.100, బెల్లం రూ.80, మైదా రూ.45, 100 గ్రాముల నెయ్యి రూ.65 ఉన్నాయి. నలుగురు కుటుంబ సభ్యులున్న ఇంట్లో

వార్త 3లో

ఈసారైనా

రక్తపాతం ఆగేనా..?

- నేడు దేవరగట్టులో కర్రల సమరం
- ఉత్సవానికి పోలీసుల పహారా

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/హొళగుంద

హొళగుంద మండలం దేవరగట్టులో శనివారం రాత్రి జరిగే బన్ని ఉత్సవాల్లో రక్తం చిందకుండా ఆపేందుకు పోలీసులు ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా ప్రయత్నాలు చేస్తు న్నారు. ఈ ఉత్సవాలకు

వార్త 3లో



గతేడాది జరిగిన బన్ని ఉత్సవంలో కర్రలతో పాల్గొన్న ప్రజలు (ఫైల్)



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాష

ప్రతి ఆడ బిడ్డనూ చదివించాలి

- కలెక్టర్ రంజిత్‌బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సమాజంలో ప్రతి ఆడబిడ్డను చదివించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాష పిలుపునిచ్చారు. శుక్రవారం అంతర్జాతీయ బాలిక దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జెసి డాక్టర్ బి.నవ్య పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం భేటి బచావో బేటి పడావో అనే కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో అమలు చేస్తోందని తెలిపారు. ఆడపిల్లలను రక్షించుకోవాలని, మంచి చదువులు చదివించాలన్నది ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని పేర్కొన్నారు. సమాజంలో నేడు మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. అనేక మంది మహిళలు ఉన్నత పదవుల్లో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఆడపిల్లల్ని కాపాడు కోవడం అందరి బాధ్యత అని తెలిపారు. బాలికలు మహిళలు చట్టాల పట్ల పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో రాణించగల సామర్థ్యం ఉందన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలకు ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ అవకాశాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి సాధించాలని సూచించా రు. ఐసిడిఎస్ పిడి వెంకటలక్ష్మి, జిల్లా పరిషత్ సిఇఒ నాసరరెడ్డి, డిఎస్‌పి శ్రీనివాస ఆచారి పాల్గొన్నారు.



రతన్ టాటాకు నివాళులర్పిస్తున్న వేదాస్ స్వచ్ఛంద సేవ సంస్థ సభ్యులు

నకిలీ ఆర్‌టిఎ అధికారుల అరెస్టు

- రిమాండ్‌కు నిందితులు - సిఐ శ్రీరామ్

ప్రజాశక్తి - ఆదోని

ఆర్‌టిఎ అధికారులమంటూ దోపిడీకి ప్రయత్నించిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఆదోని వన్ టౌన్ సిఐ శ్రీరామ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈ నెల 7న రాత్రి 11.30 గంటల సమయంలో కేరళ రాష్ట్రం మలప్పురమ్ జిల్లా నైక్కన్ కూలి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్, తన క్లీనర్ వినోద్‌తో కలిసి కెఎ 01 ఎజె 9676 నెంబర్ గల లారీలో తాండూర్ నుంచి నాపరాయి లోడ్ చేసుకుని తిరిగి వెళ్తూ ఆదోని వన్ టౌన్ పరిధిలోని కొత్త బ్రిడ్జి దగ్గరకు చేరుకున్నారని తెలిపారు. లారీని గమనించి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డుపై నిలబడి ఉండి లారీని ఆపి తాళాలు తీసుకుని తాము ఆర్‌టిఎ అధికారులమని, లారీ రికార్డులు చెక్ చేయాలని చెప్పి బెదిరించి, లారీని వదలాలంటే రూ.లక్ష 'ఫోన్ పే' చేయాలని డిమాండ్ చేశారని బాధితులు ఫిర్యాదు చేశారని చెప్పారు. 'అంత డబ్బు లేదు' అన్నందుకు క్లీనర్ వినోద్‌కు చెందిన ఫోన్ తీసుకొని కిందికి పడేశారని, సెల్‌ఫోన్ పగిలి డిస్‌ప్లే పోయిందని తెలిపారు. వారిపై దౌర్జన్యం చేస్తూ చేతులతో చెంపపైనా, మెడపైనా కొడుతుండగా డ్రైవర్, క్లీనర్ తప్పించుకునేందుకు గట్టిగా కేకలు వేశారని చెప్పారు. అటువైపుగా వెళ్లే వారు వారి వద్దకు వచ్చే సరికి నిందితులు అక్కడి నుంచి పారిపోయారని తెలిపారు. డ్రైవర్ సుభీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. విచారణలో భాగంగా శుక్రవారం 11.40 గంటలకు ఆదోనిలోని తిమ్మారెడ్డి బస్టాండ్ వద్ద ఎస్పీ ఆదేశాల మేరకు ఆదోని డీఎస్పీల పర్యవేక్షణలో నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులు ఆదోని పట్టణం అంబేద్కర్ నగర్‌కు చెందిన మాల అశోక్ కుమార్ ఆదోని పట్టణానికి చెందిన పొట్లపాడు వీరేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐ శ్రీరామ్

ఎమ్మెల్యే సారూ..!

హామీలు ఏమయ్యాయి

- కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రమేష్ యాదవ్

ప్రజాశక్తి - ఆదోని



ఎన్నికల సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి ఎమ్మెల్యే సారూ..! అంటూ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రమేష్ యాదవ్ ఎమ్మెల్యే పార్థసారథిని ప్రశ్నించారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంలో మంచి పలుకుబడి ఉందని.. ప్రత్యేక నిధులతో ఆదోనిని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పార్థసారథి ఎన్నికల సందర్భంగా హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. అధికారం చేపట్టి నాలుగు నెలలు గడిచినప్పటికీ ఒక్క పైసా కూడా ప్రత్యేకంగా నిధులు తెచ్చారా అంటూ నిలదీశారు. మాటలతో గారడీ చేసి ఆదోని ప్రజలను మోసం చేయాలని చూస్తే నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వినతిపత్రాలు ఇచ్చామని చెబుతున్నారు తప్ప ఆదోని అభివృద్ధిపై ఎలాంటి ప్రణాళికతో ఉన్నారో తెలపాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి బస్సులు ప్రారంభించినంత మాత్రాన మార్పు కాదని పేర్కొన్నారు. గత ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి కూడా ఆర్‌టిసి బస్సులను ప్రారంభించిన దాఖలాలు ఉన్నాయని, అది మరచి తాను ఒక్కడే బస్సులు తెప్పించానని అబద్ధాలు చెప్పడం దారుణమని విమర్శించారు. వాస్తవాలు మాట్లాడితే గౌరవంగా ఉంటుందని పేర్కొన్నారు. త్వరలోనే ఆదోని సమస్యలపై ఇండియా వేదిక ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని, ప్రజలు కలిసి రావాలని కోరారు.

ఆర్‌టిసిలో ప్రయాణం సురక్షితం

- ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

ఆర్‌టిసిలో ప్రయాణం సురక్షితమని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పార్థసారథి కోరారు. డిపో పరిధిలో కొత్తగా మంజూరయిన ఆర్‌టిసి బస్సులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఎపిఎస్‌ఆర్‌టిసి బస్సులను మంజూరు చేయలేదని, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఆర్‌టిసిని నిర్లక్ష్యం చేసి ప్రభుత్వ ఆస్తులను నిర్వీర్యం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎమ్మెల్యేగా అయ్యాక ఆదోనిలో ఏకంగా 17 బస్సులను ప్రారంభించామని తెలిపారు. ఇది అభివృద్ధి కాదా, ఇది మార్పు కాదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి సేవలు అందిస్తోందని తెలిపారు.



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి



14 నుంచి దస్తగిరి స్వామి ఉరుసు ఉత్సవాలు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కుంకునూరు గ్రామంలో ఈనెల 14 నుంచి దస్తగిరయ్య స్వామి ఉరుసు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు శుక్రవారం తెలిపారు. 14న గంధం, 15న ఉరుసు, 17న జియారత్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మెడికల్ కళాశాలను ప్రారంభించాలి

- విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

ప్రజాశక్తి- ఆదోని

ఆదోనిలో ప్రభుత్వ వైద్య కళాశాలను నిర్మించి, తరగతులు ప్రారంభించాలని విద్యార్థి, యువజన సంఘాల జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సాబీర్ బాష, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు అఖండ, జిల్లా కోశాధికారి సోమశేఖర్, డిఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, బిడిఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రమేష్, ఎన్ఎస్‌యుఐ డివిజన్ అధ్యక్షులు బాలు, డివైఎఫ్ఐ నాయకులు గోవిందరాజులు మాట్లాడారు. ఆదోనిలో అర్ధాంతరంగా నిలిచిపోయిన మెడికల్ కళాశాల పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఆదోనిలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభిస్తే చుట్టుపక్కల ప్రజలకు మంచి వైద్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు వైద్య విద్య అందుతుందన్నారు. వైద్య విద్య ప్రయివేటీకరణ జరిగితే ఎంతో మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరం కావాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. రిజర్వేషన్ల ఊసే ఉండదని తెలిపారు. భవిష్యత్తులో ఉచిత వైద్య సేవలు కూడా పేదలకు అందవని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ ప్రాంత ప్రజలను మేల్కొల్పి మెడికల్ కళాశాలను సాధించుకునే దిశగా ఉద్యమ ప్రణాళిక రచిస్తామన్నారు. పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, సంఘాలు తాము నిర్వహించే ఉద్యమానికి కలిసి రావాలని కోరారు.



సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి, సంఘాల నాయకులు

రతన్ టాటాకు 'వేదాస్' ఘన నివాళి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వేదాస్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త రతన్ టాటాకు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో వేదాస్ డైరెక్టర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో రతన్ టాటాకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. రతన్ టాటా సంపాదనలో 67 శాతం సమాజానికి ఉచితంగా ఇచ్చేవారని తెలిపారు. కార్పొరేట్ సామాజిక రంగం ఒక విప్లవ పితామహుని కోల్పోయిందని చెప్పారు. పేదల కలగా ఉన్న కారును కేవలం రూ.లక్షలోనే 'నానో కారు'గా తెచ్చిన ఘనత కేవలం టాటాకు మాత్రమే దక్కిందన్నారు. అన్ని కార్పొరేట్ సంస్థలు ఇలాగే సామాజిక సేవను ఒక బాధ్యతగా భావిస్తే పేదరికం లేని సమాజాన్ని చూడొచ్చని తెలిపారు. శాప్ నెట్ మాజీ ఛైర్మన్ మాచాని వెంకటేష్, ఎంపిపి కేశన్న, ప్రియా స్వచ్ఛంద సంస్థ ఛైర్మన్ షఫీవుల్లా, హై కోర్ట్ అడ్వకేట్ కాకర్ల చంద్రశేఖర్, ఎల్ఐసి అసోసియేషన్ ప్రెసిడెంట్, వేదాస్ అధ్యక్షులు ఎస్.ప్రభాకర్, సోమేష్, సినిమా డిస్ట్రిబ్యూటర్ భరత్ సాగర్, సందీప్ కుమార్, నజీర్ పాల్గొన్నారు.

అక్రమాలు నిగ్గు తేల్చాలి

- ఎంపిహెచ్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని



తిరుమల దేవస్థానంలో లడ్డు తయారీలో నెయ్యి సరఫరాలో జరిగిన అక్రమాలను నిగ్గు తేల్చాలని ఎంపిహెచ్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 250 గ్రాముల నెయ్యి రూ.200, కిలో నెయ్యి రూ.800 అవుతుందని, అలాంటిది తిరుపతి దేవస్థానానికి పంపే నెయ్యి కిలో కేవలం రూ.320లకు కాంట్రాక్టు దక్కించుకుంటూ అవినీతికి పాల్పడ్డారని తెలిపారు. బయటి మార్కెట్ ధరకు సగానికి పైగా వ్యత్యాసం ఉందన్నారు. ఇదో పెద్ద కుంభకోణమని, మోసమని, కుట్ర, దగా అని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అవినీతికి పాల్పడిన నిందితులను, కుట్రదారులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

శ్రీమఠంలో హిందూపురం ఎంపీ పార్థసారథి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని హిందూపురం ఎంపీ బికె.పార్థసారథి సతీసమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నట్లు ఆయన తెలిపారు.

హంద్రీనీవా కాలువకు బ్రిడ్జి నిర్మించండి

- బంటనహాల్ గ్రామ రైతులు

ప్రజాశక్తి - చిప్పగిరి

బంటనహాల్ గ్రామానికి చెందిన రైతులు గుంతకల్లు వెళ్లే దారిలో ఉన్న పొలాలకు పోవాలంటే ఇబ్బందిగా ఉందని, హంద్రీనీవా కాలువకు బ్రిడ్జి నిర్మించి ఆదుకోవాలని రైతులు కోరారు. శుక్రవారం సర్పంచి సుశీలమ్మ ఆధ్వర్యంలో రైతులు మాట్లాడారు. ఈ సమస్య ఎప్పటి నుంచో ఉందని, అధికారులు స్పందించి హంద్రీనీవా కాలువ దాటేందుకు బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు. అధికారులు సానుకూలంగా స్పందించారు. సురేష్, మల్లికార్జున, ఈశ్వరయ్య, మోహన్, గ్రామ రైతులు పాల్గొన్నారు.



హంద్రీనీవా కాలువ దగ్గర ఉన్న రైతులు

దసరాకు ధరాఘాతం..!

మొదటి పేజీ తరువాయి...

పిండి వంటలు చేసుకునేందుకు కనీసం రూ.500 వెచ్చించాల్సి వస్తోంది. సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. కొందరు ఉన్న దాంతో కొద్ది మొత్తంలో పిండి వంటలు చేసుకుంటుండగా మరికొందరు పాయసంతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. మరో వైపు గ్యాస్ ధర కూడా ఆకాశాన్ని అంటుతోంది. గృహ అవసరాలకు వినియోగించే 14.2 కిలోల వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.860గా ఉంది. చాలా మంది ఇంట్లో స్టౌవ్ వెలిగించాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

వంట నూనెల మంట..

వంట నూనెలలు సలసల కాగుతున్నాయి. లీటరు ప్యాకెట్‌పై రూ.20 నుంచి రూ.30 వరకూ ఒక్కసారిగా ధరలు పెరిగాయి. కేంద్ర ప్రభుత్వం ఇటీవల దిగుమతి సుంకం పెంచింది. ఈ నేపథ్యంలో ధరలు అమాంతంగా పెరిగాయి. ఇప్పటికే నిల్వ ఉన్న సరుకును కూడా అధిక ధరలకు విక్రయించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. కొంత మంది వ్యాపారులు 'నో స్టాక్' బోర్డును పెట్టి కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. సన్‌ఫ్లవర్ నూనె 15 లీటర్ల డబ్బా ఖరీదు గతవారం వరకు రూ.1,730 ఉండగా తాజాగా అది రూ.2వేలకు చేరింది. లీటరు ప్యాకెట్ ధర రూ.108 నుంచి రూ.125-రూ.130కి ఎగబాకింది. అంటే లీటరుపై రూ.17 నుంచి రూ.23 వరకు పెరిగింది. 15 లీటర్ల పామాయిల్ నూనె డబ్బా ధర వారం క్రితం వరకు రూ.1,530 ఉండగా, ఇప్పుడది రూ.1,730 దాటింది. గతంలో లీటరు పామాయిల్ ధర రూ.95 ఉండగా తాజాగా రూ.115కి చేరింది. లీటరుకు రూ.20 వరకు పెరిగింది. పూజలకు వినియోగించే వివిధ రకాల నూనెల ధరలు కూడా అమాంతంగా పెంచేశారు. మొన్నటి వరకు లీటరు ధర రూ.100 ఉండగా, అవి ఇప్పుడు రూ.125-130కి చేరాయి.

అన్నీ బయటే కొనుగోలు..

ఒకప్పుడు పండగకు కావాల్సిన వస్తువులను గ్రామాల నుంచి సేకరించేవారు. కానీ ప్రస్తుతం గ్రామాల నుంచి పట్టణాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. దసరాకు కావాల్సిన వస్తువులను ఎక్కువగా మంది కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నారు. మామిడి తోరణాల దగ్గర నుంచి పూలు, పండ్లు, తమలపాకులు, వంటి వాటిని మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు. వీటి ధరలు కూడా తక్కువేం లేవు. వాటి దగ్గరికి వెళ్లాలంటే జేబులకు చిల్లు పడినట్లే.

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. ఏటా వానకాలంలో సహజంగా కూరగాయల ధరలు పెరుగుతుంటాయి. కానీ మునుపెన్నడూ లేని విధంగా ధరలు ఆకాశాన్నంటాయి.

- జలజాక్షి, ఆదోని.

పెరిగిన ధరలకు అనుగుణంగా

పెరిగిన ధరలకు అనుగుణంగా పండగ తూతూమంత్రంగా జరుపుకోవాల్సి వస్తోంది. ఏవి కొనాలన్న కొనలేని పరిస్థితి నెలకొంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ధరలు భారీగా పెరిగాయి. పిండి వంటలకు ఏ ఒక్క వస్తువు కొనాలన్నా కిలో 50 రూపాయల పైనే ఉంది.

- వెంకటేశ్వర్లు, పెద్దగుమ్మడాపురం, కొత్తపల్లి మండలం.

అనారోగ్యంతో ప్రధానోపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి- దేవనకొండ



మండలంలోని కోటకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న కృష్ణయ్య(55) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మతి చెందినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఆయన మృతికి పాఠశాల ఉపాధ్యాయులు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

మంచాలమ్మకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం

ప్రజాశక్తి - మంత్రాలయం



మంత్రాలయంలో అభిషేకం చేస్తున్న పీఠాధిపతులు

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో గ్రామ దేవతగా పూజలందుకుంటున్న మంచాలమ్మకు శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. శుక్రవారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయంలో ఆమె విగ్రహానికి పండితులు, సంస్కృత విద్యాపీఠం విద్యార్థుల వేదమంత్రాల మధ్య ఘనంగా అభిషేకం నిర్వహించారు. అమ్మవారికి వివిధ రకాల పూలమాలలు వేసి అందంగా అలంకరించారు. అనంతరం కుంకుమార్చనతో ధూప, దీప, నైవేధ్యాలతో అర్చించి మంగళ హారతులు ఇచ్చారు. పీఠాధిపతుల పూర్వాశ్రమ కుమారులు రాజా ఎస్.అప్రమేయచార్ పాల్గొన్నారు. **చిప్పగిరి** మండలం నేమకల్లు గ్రామంలో ఎస్సీ కాలనీలో ఉన్న సుంకులమ్మ, తాయమ్మ దేవతలకు అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు మహిళలు ఈరమ్మ, శ్రావణి, రాజేశ్వరి, తిక్కమ్మ తెలిపారు.

ఆదోనిరూరల్ : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో వెలిసిన శ్రీమహాయోగి లక్ష్మమ్మ అవ్వను తమలపాకులతో అలంకరించారు. భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు రాచోటి రామయ్య, రాచోటి సుబ్బయ్య అవ్వను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కౌతాళం : మండలంలోని ఉప్పరహాల్, వల్లూరు గ్రామాల్లో దసరా ఉత్సవాల సందర్భంగా దేవతలకు అలంకరణ, పురాణ కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉప్పరహాలు గ్రామంలో మారెమ్మ దేవి మహిషాసుర మర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామస్తుల సమక్షంలో ఏర్పాటు చేసిన పురాణ కార్యక్రమం ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పురాణ కార్యక్రమం అనంతరం ప్రసాదాలను అందజేశారు.



నేమకల్లు ఎస్సీ కాలనీలో పూజలందుకుంటున్న అమ్మవారు



ఆదోనిలో పూజలందుకుంటున్న మహాలక్ష్మమ్మ అవ్వ



కౌతాళంలో పూజలందుకుంటున్న అమ్మవారు



ఆయుధ పూజ చేస్తున్న ట్రెయినీ డీఎస్పీ ఉషశ్రీ, సిఐ జయన్న

పోలీసు స్టేషన్‌లో ఆయుధ పూజ

ప్రజాశక్తి - పత్తికొండ

పత్తికొండ పోలీసు స్టేషన్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ట్రెయినీ డీఎస్పీ ఉషశ్రీ ఆయుధ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రెయినీ డీఎస్పీ ఉషశ్రీ, అర్బన్ సిఐ ఎ.జయన్న మాట్లాడారు. శక్తికి ప్రతీకగా నిలిచే దుర్గామాత సమక్షంలో ప్రతి ఆయుధానికీ పూజ చేసినట్లు తెలిపారు. విజయదశమి సందర్భంగా డివిజన్ కేంద్రంలో ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ఉండాలని ఆకాంక్షించారు. ఎస్ఐలు గోపాల్, వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయివేట్ మద్యం దుకాణాలకు
ముగిసిన దరఖాస్తు గడువు

- ఎక్సైజ్ శాఖ సిఐ మంజుల

ప్రజాశక్తి- కోడుమూరు రూరల్



కోడుమూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 2024-26 సంవత్సరానికి ప్రయివేట్ మద్యం దుకాణాలకు గడువు ముగిసిందని ఎక్సైజ్ సిఐ మంజుల తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడారు. చివరి రోజు వరకు మొత్తం 14 దుకాణాలకు గాను 507 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కోడుమూరు మండలంలో 5, గూడూరు 3, సి.బెళగల్ 2, వెల్దుర్తి 3, క్రిష్ణగిరి 1 తమ పరిధిలో ఉన్నాయని చెప్పారు. ఈనెల 14న జిల్లా పరిషత్ ప్రాంగణంలో డ్రా తీయనున్నట్లు తెలిపారు.

ఈసారైనా రక్తపాతం ఆగేనా..?

మొదటి పేజీ తరువాయి...

800 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇందులో ఏడుగురు డీఎస్పీలు, 42 మంది సీఐలు, 54 మంది ఎస్ఐలు, 112 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 362 మంది కానిస్టేబుళ్లు, 50 మంది స్పెషల్‌పార్టీ పోలీసులు, 3 ప్లటూన్ల ఏఆర్ పోలీసులు, 95 మంది హోంగార్డులు బన్ని ఉత్సవం బందోబస్తు విధుల్లో పాల్గొంటారు. 100 నైట్ విజన్ సిసి కెమెరాలు, 700 ఎల్ఈడి లైట్లు, 5 డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచారు. దేవరగట్టు పరిసర గ్రామాల్లో ప్రధాన రహదారుల్లోనే కాకుండా చిన్న చిన్న దారుల్లోనూ బందోబస్తులు, చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నారు. అగ్గి దివిటీలు, ఇనుప రింగులు తొడిగిన కర్రలను నిషేధించారు. ఇప్పటికే 550 రింగులు తొడికిన కర్రలను వందల సంఖ్యలో స్వాధీనం చేసుకున్నారు. దేవరగట్టు కొండ పరిసర ప్రాంతాలైన సులువాయి, మునానుగుంది, అరికెర, కొండపైకి వెళ్లే దారిలోని బిలేహాల్ వంటి పది చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. వాహనాలకు కొండ దగ్గరకు అనుమతించడం లేదు. ప్రతియేటా కర్రల సమరంలో కర్రలు కరాళ నృత్యం చేస్తుంటాయి. ఉత్సవమూర్తులను దక్కించుకోవడానికి వేలాది మంది కర్రలతో సమరానికి సై అంటూ రంగంలోకి దిగుతారు. ఒక గ్రూపు వారు విగ్రహాలను తీసుకెళ్తుంటే, మరో గ్రూపు వారు ఆపే ప్రయత్నం చేస్తారు. ఇలా రెండు గ్రూపుల మధ్య కర్రల సమరం నడుస్తుంది. అనంతరం విగ్రహాలను తిరిగి దేవరగట్టు మీద ఉంచడంతో ఉత్సవం పూర్తవుతుంది. కర్రల సమరంలో వందలాది మంది తలలు పగులుతుంటాయి. గతేడాది కూడా 90 మందికి గాయాలయ్యాయి. ఈ ఏడాదైనా కర్రల సమరానికి తెర పడుతాందా లేదా అనేది వేచిచూడాలి.

దళిత గ్రామంపై ఎన్నాళ్లీ చిన్నచూపు..!

- ఏళ్ల తరబడి మధ్యలోనే ఆగిన వంతెన నిర్మాణ పనులు - పురాతన వంతెనపై భయంతో ప్రయాణం
- ప్రభుత్వాలు మారిన పరిష్కారానికి నోచుకోని వైనం - ఇబ్బందుల్లో కోల్స్ ఆనందపురం గ్రామస్తులు



శిధిలావస్థకు చేరిన బ్రిడ్జీ

ప్రజాశక్తి - పాములపాడు

ప్రభుత్వాలు దళితుల అభివృద్ధికి నిరంతరం పాటు పడుతున్నాయని పాలకులు, అధికారులు వేదికలపై ఊకదంపుడు ఉపన్యాసాలు దంచి కొడుతుంటారు. ప్రభుత్వాలు, పాలకులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులు మారుతూనే ఉన్నారు. కానీ దళిత గ్రామమైన కోర్స్ ఆనందపురం ప్రజల చిరకాల కోరిక బ్రిడ్జీ నిర్మాణాన్ని 15ఏళ్ల నుండి పూర్తి చేయడం లేదు. దళిత గ్రామంపై ఇంకా ఎన్నాళ్లీ చిన్నచూపు అని గ్రామస్తులు వాపోతున్నారు. తమ గ్రామాన్ని ప్రభుత్వాలు ఓటు బ్యాంకుగా వాడుకోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు తమ గ్రామంపై వివక్ష వీడి బ్రిడ్జీ నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

పాములపాడు మండలం జూటూరు మజార గ్రామం కోర్స్ ఆనందపురం దళిత గ్రామం. అన్ని కుటుంబాలు దళితులే ఉంటారు ఈ గ్రామానికి వెళ్లాలంటే కేసి కెనాల్ బ్రిడ్జిపై వెళ్లాల్సిందే కేసి కాల్వపై బ్రిటిష్ కాలంలో నిర్మించిన బ్రిడ్జి శిధిలావస్థకు చేరుకున్నది బ్రిడ్జి ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్తులు భయపడుతూ బ్రిడ్జిపై రవాణా చేయాల్సిన పరిస్థితి నెలకొని ఉంది భారీ వాహనాలు గ్రామానికి వెళ్లాలంటే భయాందోళన చెందాల్సిన పరిస్థితి ఉంది. బ్రిటిష్ కాలంలో నిర్మించిన బ్రిడ్జిలను 20ఏళ్ల కిందనే కూలగొట్టి వాటి స్థానంలో కొత్త బ్రిడ్జిలు నిర్మించారు. కానీ కోల్స్ ఆనందపురం గ్రామానికి వెళ్లే బ్రిడ్జి నిర్మాణానికి 2007లో అప్పటి జడ్పీ ఛైర్మన్ లబ్బి వెంకటస్వామి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ పిల్లర్స్ వరకు నిర్మించి మధ్యలో వదిలేశాడు. ఆనాటి నుండి దాదాపుగా 16ఏళ్లు అయినా.. నిర్మాణం పూర్తి కాలేదు. నందికొట్కూర్ ఎస్సీ నియోజకవర్గం. ఎన్నికల సమయంలో బ్రిడ్జీ నిర్మిస్తామని నాయకులు,



నిర్మాణం మధ్యలో ఆగిన బ్రిడ్జీ

ప్రభుత్వాలు మాటలు చెప్పడమే తప్పా... చేసిందేమీ లేదు. ఇప్పటికీ ముగ్గురు ఎమ్మెల్యేలు మారి నాల్గో ఎమ్మెల్యే కొనసాగుతున్నారు. ఈ సమస్యపై సర్వసభ్య సమావేశాల్లో ప్రజా ప్రతినిధులు లేవనెత్తినప్పటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదు. బ్రిడ్జీ నిర్మించాలని వామపక్ష నేతలు, ప్రజాసంఘాల నాయకులు నిరసనలు వ్యక్తం చేసి ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినా.. చలనం రావడం లేదనే విమర్శలు లేకపోలేదు.

వెంటనే బ్రిడ్జీ నిర్మాణం చేపట్టాలి

రవితేజ, కోల్స్ ఆనందపురం గ్రామస్తుడు.



ఎన్నికలు వచ్చిన ప్రతిసారి నాయకులు గ్రామానికి వస్తారు. బ్రిడ్జి నిర్మిస్తామంటారు. ఎన్నికలు అయిపోయాక మళ్లీ ఆ సమస్యను పట్టించుకోరు. అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదు. ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. గ్రామానికి రవాణా సౌకర్యం చాలా కష్టంగా మారింది. భారీ వాహనాలు గ్రామంలోకి రావాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి. పాలకులు ఇప్పటికైనా మా గ్రామానికి బ్రిడ్జీ నిర్మించి సౌకర్యాన్ని కల్పించాలి.

దళిత గ్రామంపై వివక్ష తగదు



నందికొట్కూరు నియోజవర్గం ఎస్సీ రిజర్వు అయ్యి 15ఏళ్లు పూర్తైంది. దళిత గ్రామమైన కోల్స్ ఆనందపురానికి బ్రిడ్జీ నిర్మాణం పూర్తి చేయలేదు. ముగ్గురు ఎమ్మెల్యేల పదవీ అయిపోయింది. నాలుగో ఎమ్మెల్యే అయినా.. సమస్యను పరిష్కరించి ప్రజలకు రవాణా సౌకర్యాన్ని మెరుగు పర్చాలి. దళిత గ్రామంపై వివక్ష వీడి ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

బాలయ్య, సిపిఎం నాయకులు .

అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే



సమస్యలపై వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. సున్నిపెంటలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ముందుగా కాలనీలో మాల మహానాడు ఏరియా, పూర్ణానంద ఆశ్రమం, మటన్ మార్కెట్ ఎలిమెంటరీ స్కూలు తదితర కార్యక్రమాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఐదేళ్ల వైసిపి ప్రభుత్వం చేసిన వైఫల్యాలను, రాబోయే టిడిపి ప్రభుత్వంలో అందించే సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. అలాగే ప్రభుత్వ వైద్యశాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్య సౌకర్యాలను తెలుసుకున్నారు. అలాగే బ్లడ్ బ్యాంకు, ఎక్స్రే, చిన్నపిల్లల వార్డు, ల్యాబ్, ఆపరేషన్ థియేటర్లను పరిశీలించి మందులపై డాక్టర్‌ను అడిగి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం వైద్యశాలలో సమస్యలపై డాక్టర్లతో సమీక్షించారు. అనంతరం ఏపీ జెన్కో కాన్ఫరెన్స్ హాల్‌లో మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 100రోజుల్లోనే శ్రీశైలం నియోజకవర్గంలో ఎక్కువగా ఇల్లు, ఇంటి స్థలాలు, పింఛన్లు, ఆరోగ్య సమస్యలపై వినతులు వస్తున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ తప్పకుండా ఇల్లు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే శ్రీశైలం నియోజకవర్గానికి ఎన్‌ఆర్‌ఇజిఎస్ కింద రూ. 20 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని, ఇందులో ప్రధానంగా సున్నిపెంట కాలనీకి రూ. 3కోట్లతో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ కాల్వలు నిర్మించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్రమంతా పండుగ వాతావరణం ఉండేలా ఈ నెల 14 నుండి 20 వరకు పల్లె పండుగ కింద అన్ని గ్రామాల్లో భూమి పూజ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమములో టిడిపి నాయకులు వై. యుగంధర్ రెడ్డి, బిజెపి సోమిశెట్టి మల్లికార్జున, టిడిపి నాయకులు ప్రవీణ్ తేజ, రామసుబ్బారెడ్డి, ప్రజారాజ్యం నాయకులు నాగసాయి, మహిళలు పాల్గొన్నారు.

గుంతలను పూడ్చండి మహాప్రభో



గుంతలను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు నుంచి పగిడ్యాలకు వెళ్లే గుంతల మయంగా ఉన్న రోడ్లను బాగు చేసి ప్రజల కష్టాలు తీర్చండి మహాప్రభో అంటూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి. పకీరి సాహెబ్, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు డి బాబు ప్రజా ప్రతినిధులను, అధికారులను డిమాండ్ చేశారు. నందికొట్కూరు–పగిడ్యాలకు వెళ్లే రోడ్డు గుంతలను వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పరిశీలించి వారు మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రధాన రహదారి శిథిలమైందని, ఈ రోడ్డుపై నిత్యం లక్ష్మాపురం, ప్రాతకోట, ఘణపురం, సంకిరేణి పల్లె, బీరవోలు తదితర గ్రామాలకు ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో ప్రజలు ప్రయాణాలు కొనసాగిస్తుంటారని తెలిపారు. రోడ్డు గుంతలు పడడంతో ఆటో కార్మికులు దినదిన గండంగా గడుపుతున్నారని, ఏ క్షణాన ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారని అన్నారు. తక్షణమే ఎంపి, ఎమ్మెల్యే, జిల్లా ఉన్నత అధికారులు రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కనీసం గుంతలను పూడ్చి ప్రయాణికులకు ప్రమాదాలు నివారించాలని వారు కోరారు. లేని పక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలో చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కార్పెంటర్ రషీద్, చాకలి నాగన్న, గ్రామస్తులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, నాగ శేషులు, మా బాష, రమేష్, షాలు, మహ్మద్ బాషా పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై సోషల్ ఆడిట్



ఉపాధి హామీ పనుల రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - బేతంచర్ల

జాతీయ ఉపాధి హామీ పథకం 18వ విడత సామాజిక తనిఖీ 2023వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో జరిగిన పనులపై శుక్రవారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా మండలంలోని అంబాపురం, తవిసికొండ, బుక్కాపురం, గోరుమానుకొండ, ముద్దవరం తదితర గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి సోషల్ ఆడిట్ డిఆర్‌పిలు తనిఖీ నివేదికలు సమర్పించారు. కార్యక్రమంలో ఇఒ దస్తగిరి బాబు, ఎంఇఒ సోమశేఖర్, ఎపిఒ శేషన్న, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ రాజశేఖర్, ఆయా గ్రామాల్లోని ఎన్‌ఆర్‌ఇజిఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది, కూలిలు పాల్గొన్నారు.


దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం : సిఐ



అబ్దుల్‌హక్ ను అభినందిస్తున్న సిఐ

ప్రజాశక్తి - ఆత్మకూరు

క్రీడలతోనే ఉద్యోగ అవకాశాలు వస్తాయని, దేశ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని ఆత్మకూరు రూరల్ సిఐ సురేష్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆత్మకూర్ పట్టణానికి చెందిన అబ్దుల్ హక్ అనే క్రీడాకారుడు క్రికెట్‌లో రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో శుక్రవారం ఆత్మకూరు రూరల్ సిఐ అభినందనలు తెలిపి మాట్లాడారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన అబ్దుల్ హక్ ు ఎస్‌జిఎఫ్ అండర్–19 రాష్ట్రస్థాయి క్రికెట్ క్రీడ పోటీలకు ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. పేద కుటుంబం నుంచి క్రీడాకారుడు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్టణానికి, జిల్లాకు గర్వకారణం అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ అభివృద్ధికి యువత పాత్ర చాలా కీలకమన్నారు. యువకులందరూ యవ్వన దశ నుంచి చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తూ మంచి మార్గంలో నడవాలన్నారు. క్రీడలు యువకులను సన్మార్గంలో నడిపిస్తాయన్నారు. క్రీడాకారుడు కర్నూల్‌లో ఉన్న టౌన్ మోడల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతూ క్రికెట్ పట్ల మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడానికి ప్రోత్సహించిన వ్యాయామ ఉపాధ్యాయునికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన క్రీడాకారుడు రాష్ట్ర స్థాయిలో రాణించి జాతీయ స్థాయికి వెళ్లాలని సీనియర్ క్రీడాకారులు ప్రోత్సహించారు.


మంత్రి లోకేష్‌తో ఎమ్మెల్యే గిత్త జయసూర్య


మంత్రి లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే గిత్త

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను ఎమ్మెల్యే గిత్త జయసూర్య అమరావతి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిశారు. అనంతరం నియోజకవర్గంలోని పలు సమస్యలపై మంత్రితో చర్చించారు. సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ ఇచ్చారని, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడపించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో పగిడ్యాల మండల టిడిపి కన్వీనర్ పలుచని మహేశ్వర్ రెడ్డి, సర్వోత్తమ రెడ్డి ఉన్నారు.

సాగు తాగునీరు అందించాలి

మిడుతూరు : మండలానికి సాగు తాగునీరు అందించాలని ఎమ్మెల్యే గిత్త జయ సూర్య, చెరుకు చెర్లసర్వోత్తమ్ రెడ్డిలు మంత్రి నారా లోకేష్‌ను కలిసి కోరారు. మంత్రి లోకేష్ స్పందిస్తూ.. మండలానికి సాగు, తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. మిడుతూరు మండలంలో 19 గ్రామ పంచాయతీలు ఉన్నాయని, మొత్తం సాగు భూమి దాదాపు 40 వేల ఎకరాలు ఉంటుందని మంత్రికి వివరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మండలానికి సాగు, తాగునీరు అందించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ పోతుందన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు సకాలంలో సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ పరికరాలు ఇచ్చిందని తెలిపారు.

చివరి రోజు 172 దరఖాస్తులు


క్యూలో ఉన్న దరఖాస్తుదారులు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : నందికొట్కూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చివర రోజు కావడంతో మద్యం దుకాణాలకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. నందికొట్కూరు, పగిడ్యాల, మిడుతూరు, జూపాడుబంగ్లా మండలంలో ప్రభుత్వం ప్రకటించిన (10) మద్యము దుకాణాలకు శుక్రవారం సాయంత్రం వరకు వచ్చిన దరఖాస్తు వివరాలు.. నందికొట్కూరు షాప్-25కు15, షాప్-26కు17, షాప్-27కు20, షాప్-28కు16, నందికొట్కూరు రూరల్ షాప్-29కు12, 30కు8, జూపాడుబంగ్లా షాప్-31కు50, మిడుతూరు షాప్-32కు12, మిడుతూరు షాప్-33కు13, పగిడ్యాల షాప్-34కు9 మొత్తం 172 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సిఐ రామాంజనేయులు తెలిపారు.

నవరాత్రి సందర్భంగా ఆయుధ పూజలు

ప్రజాశక్తి - మహానంది : మండలంలోని తిమ్మాపురం, బుక్కాపురం, మహానంది గ్రామాల్లోని సబ్ స్టేషన్లలో విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏఇ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆయుధ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సిబ్బందికి, ప్రజలకు దసరా శుభకాంక్షలు తెలిపారు. విద్యుత్ సిబ్బంది ఒత్తిడికిలోను గాకుండా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ మధుసూదన్ యాదవ్, లైన్ ఇన్‌స్పెక్టర్ శంకర్, నారాయణరెడ్డి, లైన్మెన్లు రాంపుల్లయ్య, విజయ్, రమణ, గురప్ప, సచివాలయం ఎనర్జీ సెక్రటరీలు చంద్ర, రాజశేఖర్, పవన్, కిరణ్, సాయి, బాషా, దినేష్ రెడ్డి పాల్గొన్నారు. **కొత్తపల్లి :** కొత్తపల్లి పోలీస్ స్టేషన్లో ఎస్ఐ కేశవ ఆధ్వర్యంలో ఆయుధ పూజ చేశారు. ముందుగా స్టేషన్లో పురోహితులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలో ఉన్న ప్రజలు ప్రశాంతంగా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరారు. ప్రతి ఒక్కరూ పోలీసులతో స్నేహభావంగా మెలగాలన్నారు. **పాములపాడు :** దుర్గాష్టమి, విజయదశమి సందర్భంగా పాములపాడు పోలీస్టేషన్లో ఎస్ఐ సురేష్ బాబు పోలీస్



సిబ్బందితో కలిసి ఆయుధ పూజ నిర్వహించారు. విజయదశమిని ప్రజలు సుఖసంతోషాలతో జరుపుకోవాలని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రైటర్ రామేశ్వరరావు, కానిస్టేబుల్ యాగంటి, శ్రీనివాసులు, టవేశ్వర్, పవన్ రెడ్డి పాల్గొన్నారు.

ఆలయంలో సామూహిక చండీహోమం


ప్రజాశక్తి - బేతంచర్ల : దసరా నవరాత్రుల సందర్భంగా మండల కేంద్రంలోని అమ్మవారి శాల ఆలయంలో లోక కళ్యాణార్థం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 45 మంది దంపతులతో సామూహిక చండీహోమాన్ని శుక్రవారం నిర్వహించారు. వేద పండితులు శ్రీనాథ్ శాస్త్రి, కళ్యాణ్ చక్రవర్తి తదితరులు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్యన అమ్మవారిని స్మరిస్తూ చండీహోం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గుండా గోపాల్, లోకేశ్వర్ గుప్తా, జనార్ధన్, శేషు ఫణి, జగన్, రాజేంద్ర, ప్రసాద్, రామయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సిద్ధిధాత్రి అలంకారంలో కామేశ్వరి అమ్మవారు

ప్రజాశక్తి - మహానంది

మహానంది క్షేత్రంలో దసరా దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు శుక్రవారం వేద పండితులు విశేష పూజలు నిర్వహించారు. ముందుగా దాతలచే గణపతి పూజ, పుణ్యాహ వాచనము, రుద్ర, చండీ హోమాలు వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, కూష్మాండ బలి సమర్పించారు. సాయంకాలం సహస్ర దీప అలంకరణ సేవ నిర్వహించారు. అనంతరం రావణ వాహనంపై సిద్ధిధాత్రి దుర్గ అలంకారంలో కామేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రావణ వాహనంపై సిద్ధి ధాత్రి దుర్గ అలంకారంలో అమ్మవారి గ్రామోత్సవాన్ని ఆలయ పురవీధుల వెంట ఘనంగా నిర్వహించారు. దాతలు సహస్ర కుంకుమార్చన పూజలు నిర్వహించారు. వేద పండితులు దాతలకు ఆశీర్వచనము, తీర్థప్రసాదాలు అందజేశారు.


విద్యుదీపాలంకరణలో స్వామి, అమ్మవారు

నిత్యావసర వస్తువుల ప్రత్యేక కౌంటర్లు : జెసి



ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిత్యాసర వస్తువులు సరసమైన ధరలకు అందించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణం శ్రీనివాస్ సెంటర్ సమీపంలోని రైతు బజార్‌లో పౌర సరఫరాల శాఖ ఏర్పాటుచేసిన ప్రత్యేక విక్రయ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ ప్రారంభించి వినియోగదారులకు పంపిణీ చేశారు. జెసి మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో పామ్ ఆయిల్, సన్ ఫ్లవర్ నూనెలు అధిక ధరలు వున్న నేపథ్యంలో నూనె మిల్లుల యజమానులు, వ్యాపారులతో మాట్లాడి వినియోగదారులకు సరసమైన ధరలకు అందించేందుకు వీలుగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. నంద్యాల పట్టణం శ్రీనివాస నగర్ లోని రైతు బాజార్, టేక్కే మార్కెట్ యార్డ్‌లో ప్రత్యేక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి వినియోగదారులకు అందిస్తున్నామన్నారు. అలాగే ఆత్మకూరులో రెండు కేంద్రాలు, నందికోట్కూరు, బనగానపల్లి మండల కేంద్రాలలోను ప్రత్యేక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసామన్నారు. సన్ ఫ్లవర్ లీటరు రూ.124కు, పామ్ ఆయిల్ లీటరు రూ.110 చొప్పున ప్రత్యేక కౌంటర్లలో విక్రయిస్తున్నట్లు తెలిపారు. అలాగే అన్ని రైతు బజార్లలో టమాట కేజీ రూ.40లకు, ఉల్లిగడ్డ కేజీ రు.35లచొప్పున వినియోగదారులకు విక్రయిస్తామని జిల్లాలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన కారణంగా ఈ నెల 13 నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని రకాల జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలని ఆమె సూచించారు. గ్రామాల్లో ఉన్న మట్టి మిద్దెలు, సంక్షేమ వసతి గహేలు, పాఠశాల భవనాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పల్లె పండుగ వారోత్సవాలు విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - కొత్తపల్లి : ఈ నెల 14 నుండి 20 వరకు గ్రామాల్లో నిర్వహించే పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఎంపిడిఓ మేరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్లె పండుగ వారోత్సవాలకు గ్రామ పంచాయతీ, సచివాలయ సిబ్బంది, ఉపాధిహామీ పథకం సిబ్బంది హాజరు కావాలని తెలిపారు. వారోత్సవాల్లో సంబంధిత అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు.

మహానందీశ్వరుని సేవలో ఏపీ సిఐడి డైరెక్టర్



ప్రజాశక్తి - మహానంది

మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి అమ్మవార్లను ఏపీ సిఐడి డైరెక్టర్ నగేష్ దంపతులు శుక్రవారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. పూజల అనంతరం ఆలయ అధికారులు శేష వస్త్రంతో సత్కరించగా, వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట సిఐడి ఎస్ఐ భరత్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుల్ సుధీర్, రామిరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన మద్యం దరఖాస్తుల ప్రక్రియ

- జిల్లాలో 105 షాప్ లకు 2,155 దరఖాస్తులు - జిల్లాకు రూ. 43.10కోట్ల ఆదాయం
- 14 న లాటరీ ప్రక్రియ, 16 నుండి అమల్లోకి మద్యం పాలసీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని కోసం గత నెల చివరి నుండి ఈ నెల 9 వరకు ఆన్ లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే స్థానికంగా అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు మద్యం దుకాణాల కోసం దరఖాస్తూ చేసుకోవద్దు. ఒక్కో షాప్‌కు తమ అనుచరులే చేసుకుంటారని పోటీ ఎవ్వరు రావద్దని చెప్పడంతో పాటు బెదిరింపులకు దిగడంతో అక్కడక్కడా దరఖాస్తులు తక్కువ వచ్చాయి. కొన్ని మండలాల్లో కేవలం షాప్‌కు ఒక్కటి లేక రెండు దరఖాస్తులు రావడం దీనిపైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకోని ఎక్కడా పోటీని అడ్డుకోవద్దని, ప్రభుత్వానికి ఆదాయం రావాలని చెప్పడంతో 9తో ముగిసిన గడువును 11న రాత్రి 7గంటల వరకు పొడగించారు. చివరి రోజునే జిల్లా వ్యాప్తంగా 105 మద్యం షాప్‌లకు దరఖాస్తులు భారీగా వచ్చాయి. ఇందులో స్టేషన్ల వారీగా ఆళ్లగడ్డ 19 షాప్‌లకు 325 దరఖాస్తులు, ఆత్మకూర్ 13 షాప్‌లకు 248 దరఖాస్తులు, బనగానపల్లె 12 షాప్‌లకు 168, డోన్ 16 షాప్ లకు 370 దరఖాస్తులు, కోవెలకుంట్ల 11 షాప్‌లకు 150 ధరఖాస్తులు, నందికొట్కూరు 10 షాప్‌లకు 181దరఖాస్తులు, నంద్యాల 24 షాప్‌లకు 713 దరఖాస్తులు వచ్చాయి. ఇతర రాష్టాలు తెలంగాణ నుండి 26 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు ప్రకటించారు. ఈ నెల 14న మద్యం షాపులకు అధికారులు లాటరీ తీయనున్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 16 నుంచి కొత్త మద్యం విధానం అమల్లోకి రానుంది. ప్రభుత్వం మద్యం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని డిపాజిట్ రూ.2 లక్షలు ప్రకటంచింది. అయితే ఆ డిపాజిట్ రిఫండ్ లేదనండంతో మొదటి వ్యాపారులు వెనక్కు అడుగేసినప్పటికి తరువాత ఆన్ లైన్ దరఖాస్తులకు మొగ్గుచూపారు. మళ్లీ స్థానికంగా ఎమ్మెల్యే లు తమవారే వేయాలని, ఎవ్వరు వేయకూడదని బెదిరింపులుకు దిగడం, మద్యం షాప్‌లు దక్కించుకున్న వ్యాపారులు వచ్చే ఆదాయంలో 30 శాతం వాటా ఇవ్వాలని చెప్పడంతో మొదట్లో మందగొడిగా దరఖాస్తుల పర్వం సాగింది. చివర్లో ఊపందుకోవడంతో ప్రభుత్వానికి మద్యం దరఖాస్తుల ద్వారా భారీగా ఆదాయం వచ్చినట్లు తెలుస్తుంది.

రాయలసీమ సమానాభివృద్ధికి కార్యాచరణ చేపట్టాలి

- సిఎంకు బొజ్జా దశరథరామిరెడ్డి లేఖ



ప్రజాశక్తి - నంద్యాల

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలో చెడును పారద్రోలుతూ, మంచి దిశగా చేపట్టే కార్యక్రమాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని ప్రజలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి తెలిపారు. రాయలసీమ సమానాభివృద్ధికి కావలసిన అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు బొజ్జా లేఖ వ్రాసారు. ఈ సందర్భంగా శుక్రవారం నంద్యాల సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో దశరథరామిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమలో ప్రతి ఎకరానికి సాగునీరు అందిస్తామని ఎన్నికల ప్రచారంలో భాగంగా రాయలసీమ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు, ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా రాయలసీమ సాగునీటి రంగానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వోతోముఖాభివృద్ధి చెందేలాగా, విధానపర నిర్ణయాలు తీసుకోవడానికి సహకరిస్తుందన్న భావనతో సాగునీటి రంగానికి సంబంధించి కొన్ని గణాంకాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్ర విస్తీర్ణంలో, వ్యవసాయోగ్యమైన భూమిలో రాయలసీమ 42 శాతం కలిగి ఉందని, వ్యవసాయ యోగ్యమైన భూమిలో 44 శాతం (రాష్ట్ర సగటు) భూమికి, సాగునీరు అందించేలాగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందని తెలిపారు. రాయలసీమలో ఉన్న వ్యవసాయ యోగ్యమైన భూమిలో కేవలం 21 శాతం భూమికి, సాగునీరు అందించేలాగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్ర సాగునీటి బడ్జెట్‌లో 42 శాతం నిధులను రాయలసీమ సాగునీటి రంగానికి కేటాయింపు దిశగా తొలి అడుగు వేయాలని కోరారు. తద్వారా నిర్వీర్యమైన రాయలసీమ సాగునీటి రంగాన్ని గాడిలో పెట్టే కార్యాక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతగా చేపట్టాలనీ, రాయలసీమను సమానాభివృద్ధి దిశగా పరుగులు పెట్టించాలని చంద్రబాబునాయుడుకి విజ్ఞప్తి చేసారు. రాయలసీమలో ఏర్పాటుచేసిన కార్యాలయాల తరలింపును విరమించుకుని, వాటిని ఇక్కడే కొనసాగించాలనీ, అలాగే చంద్రబాబు నాయుడు ప్రకటించిన విధంగా హైకోర్టు, సీడ్ హబ్, హార్టికల్చర్ హబ్, వీటిలో భాగంగా ఏపీ సీడ్స్, ఏపీ విత్తన ధ్రువీకరణ ప్రధాన కార్యాలయాలు, రాష్ట్ర విభజన చట్టంలో పొందు పరిచిన జాతీయ స్థాయి వ్యవసాయ విశ్వవిద్యాలయం, హార్టికల్చర్ కమిషనరేట్, తదితర మౌళిక వసతుల ఏర్పాటుకు తక్షణమే చేపట్టాలని కోరారు. శ్రీశైలం రిజర్వాయర్ ఉన్న కర్నూలు జిల్లాలో కృష్ణా నది యాజమాన్య బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసారు.

ముగిసిన జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు..

విజేతలుగా తెలంగాణ, మహారాష్ట్ర జట్లు



ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల జిల్లా కేంద్రంగా ప్రారంభమైన 42వ జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు గురువారం రాత్రి ముగిశాయి. పట్టణంలోని శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం క్రీడా మైదానంలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలు ముగిశాయి. పోటీలను శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థలు, శ్రీ రామకృష్ణ కళాశాలలు సంయుక్తంగా నిర్వహించగా ముగింపు పోటీలకు శ్రీ రామకృష్ణ కళాశాలల అధినేత డాక్టర్ జి రామకృష్ణారెడ్డి, శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థల అధినేత డాక్టర్ పి.దస్తగిరి రెడ్డి, నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ సెక్రెటరీ మౌర్య, ఎపి సెక్రటరీ నాగేంద్ర, కర్నూలు జిల్లా సాఫ్ట్‌బాల్ సెక్రెటరీ విజయకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పి దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్న ప్రతిసారి తమ నైపుణ్యాలను పెంచుకోవాలని తెలిపారు. క్రీడలకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్ జి రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ క్రీడలతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గుర్తు చేశారు. ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. బాలుర విభాగంలో జాతీయ స్థాయి ప్రథమ స్థానంలో మహారాష్ట్ర నిలువగా, రాజస్థాన్ ద్వితీయ స్థానంలోనూ, ఆంధ్రప్రదేశ్ తతీయ స్థానంలో విజేతలుగా నిలిచాయి. అలాగే బాలికల విభాగంలో తెలంగాణ రాష్ట్రం ప్రథమ స్థానంలోనూ, పంజాబ్ ద్వితీయ స్థానంలోనూ, మధ్యప్రదేశ్ తతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు అతిథులు బహుమతులను పంపిణీ చేశారు.

జాతీయ స్థాయి క్రీడాకారులకు ఐఎంఎ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నంద్యాల : ఈ నెల 14 నుండి గోవా రాష్ట్రంలోని వాస్కోడిగామా రవీంద్ర భవన్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొంటున్న నంద్యాల పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులకు ఐఎంఎ నంద్యాల మహిళా వైద్యులు శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఐఎంఏ నంద్యాల మిషన్ పింక్ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర మిషన్ పింక్ హెల్త్ కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ సౌజన్య, నంద్యాల మిషన్ పింక్ హెల్త్ విభాగం అధ్యక్షురాలు డాక్టర్ నెరవాటి అరుణకుమారిల నిర్వహణలో స్థానిక ఐఎంఎ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు తరపున పాల్గొంటున్న నంద్యాల క్రీడాకారులు పల్లవి, మహేష్, నరసింహలకు రూ.పదివేల ఆర్థిక సహకారం అందించారు. ఐఎంఏ జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యులు,రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కష్ణ, నంద్యాల ఐఎంఏ అధ్యక్షురాలు,రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి డాక్టర్ వసుధ రాణి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ ఐఎంఏ చేస్తున్న వివిధ సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా రాష్ట్రం తరఫున పాల్గొంటున్న క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఈ సహకారం అందజేశామన్నారు. డాక్టర్ లక్ష్మీ సౌజన్య మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలలో ప్రతిభ చూపి పతకాలు సాధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దేశంలో కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మిషన్ పింక్ హెల్త్ కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ సౌజన్య, ఐఎంఏ నంద్యాల ఉపాధ్యక్షురాలు డాక్టర్ మాధవి, మిషన్ పింక్ హెల్త్ విభాగం గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ నాగమణి, అధ్యక్షురాలు డాక్టర్ అరుణకుమారి, మహిళా విభాగం గౌరవాధ్యక్షురాలు డాక్టర్ నర్మద పాల్గొన్నారు.

మంత్రులు, కలెక్టర్, ప్రజాప్రతినిధుల శుభాకాంక్షలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : చెడుపై మంచి, దుష్ట శక్తులపై దైవ శక్తుల విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగను జిల్లా ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందంగా జరుపుకోవాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాలు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి, ఎంఎల్సీలు, ఎమ్మెల్యేలు కూడ ప్రజలందరూ విజయదశమి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. నంద్యాల జిల్లా సమగ్ర అబివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయుధ పూజ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆద్వర్యంలో శుక్రవారం ఆయుధ పూజ నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యలయం నందు గల అర్ముడు రిజర్వ్ విభాగం నందు గల ఆయుధాగారం నందు దుర్గామాతకు అత్యంత భక్తి శ్రద్ధలతో జిల్లా ప్రజలు, జిల్లా,రాష్ట్ర పోలీసులు సుఖఃశాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తూ జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్.యుగంధర్ బాబు, నంద్యాల సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్లు, జిల్లా సాయుధ పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా ప్రజలకు ఆ దుర్గామాత అన్ని రంగాల్లో అందరికి విజయం చేకూర్చాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆనందంగా దసరా పండుగను జరుపుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు.

13 మద్యం షాపులకు 251 దరఖాస్తులు

ప్రజాశక్తి - ఆత్మకూర్ : ఆత్మకూర్ ఎక్సైజ్ సబ్ డివిజన్ పరిధిలోని 13 మద్యం షాపులకు 251 దరఖాస్తులు వచ్చాయని సిఐ కిశోర్ కుమార్ తెలిపారు. పాములపాడు మండల కేంద్రంలో ఉన్న ఒక్క మద్యం షాపుకు 65 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలోని నాలుగు షాపులకు 45 దరఖాస్తులు, రూరల్ పరిధిలోని రెండు షాపులకు 17 దరఖాస్తులు, కొత్తపల్లి మండలంలోని ఒక్క షాపుకు 29 దరఖాస్తులు, శ్రీశైలం మండలంలో రెండు వైన్ షాపులకు 67 దరఖాస్తులు, వెలుగోడు మండలంలోని మూడు మద్యం దుకాణాలకు 28దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. మొత్తం 5 మండలాల్లో 251 దరఖాస్తులు వచ్చినట్టు సమాచారం. శుక్రవారం సాయంత్రం 7 గంటల్లోపు దరఖాస్తుదారులు వేయవలసి ఉండగా. టెక్నికల్ సమస్యల వల్ల టెండర్ దారులుకు టోకెన్‌లను ఇచ్చి తరువాత వరుస క్రమంలో దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.

చిన్నారి వైద్యానికి ఎమ్మెల్యే హామీ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పట్టణంలోని గంగమ్మ వీధికి చెందిన దస్తగిరమ్మ, నరసింహ దంపతుల కుమార్తె మోక్షిత(7) పుట్టినప్పుడు నుండి అంతుచిక్కని చర్మ వ్యాధితో బాధపడుతుంది. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం కావడంతో పాపకు వైద్యం చేయించలేని స్థితిలో తల్లిదండ్రులు చిన్నారిని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వద్దకు తీసుకెళ్లారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి చూసి చలించిపోయిన ఎమ్మెల్యే పాపకు కార్పొరేట్ వైద్యం చేయిస్తానని హామీ ఇచ్చారు. దసరా పండగ అనంతరం తనను వచ్చి కలిస్తే హైదరాబాద్లోని కార్పొరేట్ వైద్యశాలలో చికిత్స చేయిస్తానని నిరుపేద తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. పెన్షన్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ వెంకటరామిరెడ్డిని ఎమ్మెల్యే ఆదేశించారు. మోక్షిత తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



డెంగీ కేసు నమోదు

ప్రజాశక్తి - చాగలమర్రి : పట్టణంలోని 9 వార్డులోని ఓ బాలుడికి డెంగీ పాజిటీవ్‌గా నిర్ధారణ అయినట్లు ఆళ్ళగడ్డ సబ్ యూనిట్ మలేరియా అధికారి శివచంద్రారెడ్డి శుక్రవారం తెలిపారు. డెంగీ సోకిన బాలుడి ఇంటి యందు, చుట్టూ ప్రక్కన ఇళ్ళలో ఫైరిత్రమ్ ద్రావణాన్ని పిచికారి చేసారు. అలాగే కాలనీలో మురికి నీరు నిల్వ ఉన్నచోట్ల, మురికి కాలువలలో అబెట్ ద్రావణాన్ని పిచికారి చేసారు. కాలనీలో ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేసారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ రాంలింగారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పి సురేంద్ర, హెచ్ఎలు మనోహర్, శేఖర్, ఎఎన్ఎం గార్లెట్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల్లో భూమా జగత్

ప్రజాశక్తి- చాగలమర్రి : పట్టణంలోని శ్రీ చెన్నకేశవ ఆలయం, అమ్మవారిశాలలో దసరా నవరాత్రుల ఉత్సవాల పూజల్లో ఆళ్ళగడ్డ నియోజకవర్గ తెలుగు యువత నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి శుక్రవారం రాత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అలయాలకు విచ్చేసిన భూమాకు వేద పండితులు, ఆలయాల అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, లక్ష్మణ్‌బాబుల ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన భూమాకు వేద పండితులు ఆశీర్వచనాలో తీర్థప్రసాదాలు అందజేసారు. అనంతరం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయాల కమిటీ సభ్యులు, టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాష, టిడిపి మండల కన్వీనర్ లాయర్ నరసింహ రెడ్డి, టిఎన్‌టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, కొలిమి హుసేన్ వళి, షరీఫ్, సమీద్దీన్, సల్లా నాగరాజు, జెట్టి నాగరాజు, టిఎన్ఎల్ పుల్లయ్య, ప్రతాప్‌రెడ్డి, రామసుబ్బయ్య యాదవ్, సుంకు జనార్ధన్, తొమ్మంద్రు మల్లికార్జున, సుబ్బారావు, రమేష్, నవత ప్రసాద్, భాస్కర రెడ్డి, కేఆర్‌కే రవి కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

ప్రజాశక్తి - చాగలమర్రి : క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌భాష తెలిపారు. శుక్రవారం చాగలమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రాయలసీమ స్థాయి సిద్ధిక్ మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రాయలసీమలోని వివిధ ప్రాంతాలకు చెందిన 20 జట్లు పాల్గొంటున్నాయన్నారు. ఈ పోటీలలో విజేతలకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండవ బహుమతి రూ.7 వేలు, మూడవ బహుమతి రూ.5 వేలు నగదు బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మను జల్సాగౌస్, హెచ్ఎం కోటయ్య, పిడి దాదాపీర్, టిడిపి నాయకులు మౌలాలి, హనీఫ్, ఖలీల్, గడెకారి మహమ్మద్, ఆకుల ఇర్షాద్, ముల్లా షఫి, గఫార్, రాజేష్, రఫి, అబ్దుల్లా పాల్గొన్నారు.

గోరంట్ల గ్రామాన్ని శోధించిన పోలీసులు

పట్టుబడిన మద్యం , ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్: కర్నూలు జిల్లా ఎస్‌పి బిందు మాధవ్ ఆదేశాల మేరకు శుక్రవారం తెల్లవారుజామున కోడుమూరు మండలం సిఐ తబ్రేజ్ ఆధ్వర్యంలో కోడుమూరు మండలం గోరంట్ల గ్రామంలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. గ్రామంలో రౌడీ షీటర్లను, సస్పెక్ట్‌ను, అక్రమంగా మద్యం అమ్మేవారి ఇళ్లలో తనిఖీలు చేసి అందరికీ కౌన్సిలింగ్ ఇచ్చారు. గ్రామంలో తనిఖీ చేయు సందర్భంలో చెరుకులపాడు ఈశ్వరయ్య , చెరుకులపాడు మనోహర్ వారి ఇంటిలో మద్యం దొరికింది. వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.ఈ కార్యక్రమంలో కోడుమూరు సిఐ , గూడూరు ఎస్ఐ , సి బెలగల్ ఎస్ఐ, కోడుమూరు సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.





ఘనంగా 'విత్తియ స్వశక్తికరన్ దివస్'

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జాతీయ తపాలా వారోత్సవాలు 2024 భారత ప్రభుత్వం తపాలా శాఖ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం కర్నూలు పోస్టల్ డివిజన్ వారు 'విత్తియ స్వశక్తికరన్ దివస్' ను ఘనంగా ప్రధాన తపాలా కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కర్నూలు పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ జి.జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ తపాలా శాఖ అందిస్తున్న చిన్న మొత్తాల పొదుపు, జీవితబీమా ,ఆధార్ సేవలు, కామన్ సర్వీస్ సెంటర్ ఇంకా అనేక సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. చిన్న మొత్తాల పొదుపు , జీవితబీమా సేవల్లో లక్ష్యాలను సాధించిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ నూరుల్లా, రహిమాన్, విజయమోహన్, పోస్ట్‌మాస్టర్ సి.రాజేశ్వరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కర్నూలు పోస్టల్‌డివిజన్ సూపరింటెండెంట్ జనార్ధన్‌రెడ్డి

దసరా శుభాకాంక్షలు తెలిపిన మంత్రి, కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తూ శుక్రవారం మంత్రి టిజి. భరత్ జిల్లా, కలెక్టర్ పి.రంజిత్ బాషా ఓ ప్రకటన ద్వారా వెల్లడించారు. ఈ విజయదశమి జిల్లా ప్రజలందరికీ అన్ని విషయాల్లో విజయం పొందాలని వారు ఆకాంక్షించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ తరపున డిసిసి అధ్యక్షుడు పి మురళీకృష్ణ కూడాప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు వెల్లడించారు.



గంగారాం కుటుంబానికి అండగా ఉంటాం

ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు మండలం, ఈ తాండ్రపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన 13 వార్డ్ మెంబర్ గంగారాం కుటుంబానికి అండగా ఉంటామని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. గంగారాం గుండెపోటుతో అకస్మాత్తుగా మరణించిన విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకొన్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేసి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జెమెకేర్ కామినేనిలో వరల్డ్ ఆర్థరైటిస్ డే సదస్సు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌లో వరల్డ్ ఆర్థరైటిస్ డే పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 12న వరల్డ్ ఆర్థరైటిస్ డే గా జరుపుకుంటారని తెలిపారు. ఆర్థరైటిస్‌లో 100 రకాల జబ్బులు ఉన్నాయని తెలిపారు. అందులో ఒస్టియోఆర్థరైటిస్, రూమటాయిడ్ ఆర్థరైటిస్ వంటి రోగాలు ఉన్నాయి. సర్వే రిపోర్టు ఆధారంగా ఈ వ్యాధులు ప్రపంచవ్యాప్తంగా 350 మిలియన్ల వ్యక్తులను ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆర్థరైటిస్ లక్షణాలు, సంకేతాల గురించి అవగాహన పెంచుకోవడం, వ్యాధి నిర్వహణ గురించి ప్రోత్సహించడం, మెరుగైన చికిత్స కోసం సరైన హాస్పిటల్‌ను ఎంచుకోవడం కూడా కీలకమని చెప్పారు. ఈ సదస్సులో జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్స్ ఎండి డాక్టర్ ఎస్‌వి.చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ హాస్పటల్లో ఇప్పటివరకు 605 ఆర్థో కేసెస్,428 పిఆర్పిఎస్, 168 ట్రౌమా, 180 షోల్డర్ ఆర్థ్రోస్కోపీ, 172 ఆర్థోస్కోపి, 70 టికెఆర్, 15 టిహెచ్ఆర్ కేసెస్‌ను విజయవంతంగా చేశామని చెప్పారు. జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్స్ వైద్యులు కార్డియాలజిస్ట్, డాక్టర్ రాఘవేంద్ర హెచ్ఒడి ఎమర్జెన్సీ డిపార్ట్మెంట్, డాక్టర్ రామ్మోహన్ రెడ్డి డాక్టర్ మాధవి అనస్తేషియా, సిఒఒ డాక్టర్ గణేష్, జనరల్ మేనేజర్ నదీమ్, కాల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ డాక్టర్ కీన్, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ ఆర్థోపెడిక్ డాక్టర్ రవిబాబు, ఎండి డాక్టర్ ఎస్‌వి.చంద్రశేఖర్ వైద్యులు, మేనేజర్లు, సిబ్బంది

సూర్యనారాయణ ఆలయంలో నవరాత్రి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్



శ్రీ గణపతి సచ్చిదా నంద స్వామీజీ ఆశీస్సులతో కర్నూలు శ్రీ సూర్య నారాయణ స్వామి దేవాలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి సందర్భంగా శుక్రవారం ప్రాతఃకాలంలో శ్రీ మహాగౌరీ అమ్మవారికి విశేష అభిషేకం, అర్చనలు నిర్వహించామని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహార్నవమి సందర్భంగా మహాగౌరీ అమ్మవారిని శ్రీ మహిషాసుర మర్దిని దేవిగా అలంకరించి మంటపారాధన దేవి ఖడ్గమాల లలితా సహస్రనామాలతో అర్చన చేశామన్నారు. శుక్రవారం రాహుకాల సమయంలో మహాగౌరీ అమ్మవారి సన్నిధిలో రాహుకాల, దుర్గా పూజ, లలితా సహస్రనామ పారాయణం చేశామన్నారు. అనంతరం నవ చండీ హోమం ముగింపు సందర్భంగా చండీహోమం మహా పూర్ణాహుతి జరిగిందన్నారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

ఈ- క్రాప్ నమోదు అవకతవకలతో నష్టం

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

గత ప్రభుత్వం ఈ- క్రాప్ ను తప్పనిసరి చేయడంలో జరిగిన అవకతవకల వలన రైతుల పేర్లు సరిగా నమోదు కానందున పలువురు అర్హులైన రైతులు, కౌలు రైతులు పలు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు ఈ క్రాప్ నమోదు చేయకుంటే బ్యాంకులో రుణాలు అయిన సున్నావడ్డీ, పావలావడ్డీ రుణాలు పంటల బీమా పొందలేకపోతున్నారు. పంట ఉత్పత్తులను అమ్ముకోలేక దళారులకు, వ్యాపారులకు తక్కువ ధరకు ఇవ్వాల్సి వస్తుంది. కరువు, తుపాను, వరదల వలన పంట నష్టాలు జరిగిన సందర్భాలలో ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీని కోల్పోతున్నారు. రైతులు, కౌలు రైతులు అనేక విధాలుగా నష్టపోతున్న ఈ-క్రాప్ పై కూటమి ప్రభుత్వం ఆలోచించాలని ఎపి రైతు సంఘం డిమాండ్ చేసింది. రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలకు ఇన్నాళ్లు తీవ్ర ప్రతిబంధకంగా తయారయింది. ఈ-క్రాప్ అంశం తెలుగుదేశం కూటమి ప్రభుత్వం రాకతో సున్నా వడ్డీ రుణాలు పంటల బీమా విపత్తు వలన పంటల నష్టపోతే అందించే ఇన్పుట్ సబ్సిడీ చివరికి పండించిన పంటలను రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవడానికి ఇంకా సర్కారీ పథకాలకు గత వైసిపి ప్రభుత్వం ఈ -క్రాప్ తప్పనిసరి చేసింది. ఈ క్రాప్ డిజిటల్ పోర్టల్‌లో రైతుల తమ వివరాలన్నింటిని సక్రమంగా నమోదు చేసుకుంటేనే పథకాలు వర్తిస్తాయని షరతులు పెట్టింది. కౌలు రైతులకు ఆధార్ అథెంటికేషన్ ఇకెవైసి ఇలా ఎన్నో శరతులు పెట్టారు. వీటికి ఎపి ప్రభుత్వం జారీ చేసే క్రాప్ కల్టివేటెడ్ రైట్ కార్డ్ నామాత్రంగానే జరుగుతున్నందున కౌలు రైతులు ఈ- క్రాప్‌లో నమోదు తక్కువ అవుతున్నాయి.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రైతులు పంటలు పండించి గిట్టుబాటు ధరలు లేక నష్టపోయిన వారికి గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలు సిపిఐ జిల్లా కార్యాలయంలో కర్నూలు రూరల్ మండల కార్యదర్శి బి.సురేంద్ర యాదవ్ అధ్యక్షతన సిపిఐ జిల్లా కార్యాలంలో కర్నూలు రూరల్ మండలం కమిటీ సమావేశం నిర్వహించారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం , సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మునెప్ప, రైతు సంఘం మండల గౌరవ అధ్యక్షులు సి.మహేష్ పాల్గొన్నారు. వారు రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేవని, మిరప పంట తెగుళ్ల వలన పూర్తిగా దెబ్బతిన్నదని, అంతేగాక పత్తిధర రోజురోజుకు పతనం అవుతున్నదని అన్నారు. వ్యవసాయం లాభసాటిగా లేకపోవడం వలన చాలామంది రైతులు వ్యవసాయానికి దూరమవుతున్నారు. రైతులకు ఇస్తున్న సబ్సిడీలు పెంచాలని అన్నారు. పెద్ద పెద్ద పెట్టుబడిదారులకు, పారిశ్రామిక వర్గాలకు రూ.లక్షల కోట్ల సబ్సిడీలు ఇస్తున్నారు. రైతులకు సబ్సిడీ ఇచ్చే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తటపటాయిస్తున్నాయన్నారు. రైతులకు వారికి కావలసిన పంట రుణాలు, సబ్సిడీలు వాటిపై రైతులతో చర్చించి వారికి కావలసిన సమాచారాన్ని ఇస్తూ ముందుకు సాగాలని తెలిపారు. ఇందులో రైతు సంఘం మండల కార్యదర్శి బి.కృష్ణ నాయక్, రబియా, హరికృష్ణ ,గురు శ్రీరాములు గౌడ్ పాల్గొన్నారు.

'మెడికవర్'లో అర్థరైటిస్ పై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



ప్రపంచ అర్థరైటిస్ డేని పురస్కరించు కొని మెడికవర్ హాస్పిటల్స్ వారిచే అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. రుమటాలజిస్ట్, కన్సల్టెంట్ డాక్టర్ ఎ.సృజన పాల్గొన్నారు. డాక్టర్ ఎ.సృజన తెలిపిన వివరాల ప్రకారం... ఆర్థరైటిస్ ఎముకలు, వాటి కణ జాలాలకు సంబం ధించిన సమస్య. అర్థరై టిస్‌లో 100కు పైగా రకాలు ఉన్నాయి. ఇందులో ఆస్టియోఆర్థరైటిస్, రుమటాయిడ్ఆర్థరైటిస్, యాంక్లోసింగ్ స్పాండైల్ ఆర్థరైటిస్, గౌట్, జువెనైల్ ఇడియోపథిక్ ఆర్థరైటిస్ (పిల్లల్లో వచ్చే ఆర్థరైటిస్), లూపస్, సోరియాటిక్ ఆర్థరైటిస్ వంటివి కొన్ని. సాధారణంగా 65 ఏండ్లు పైబడిన వారిని ప్రభావితం చేస్తుంది. మారిన జీవనశైలి కారణంగా ప్రస్తుతం అన్ని వయసుల వారిలో కనిస్తున్నది. భారతదేశంలో 18 కోట్ల పైగా ప్రజలు ఆర్థరైటిస్ సమస్యతో బాధ పడు తున్నట్లు గణాంకాలు చెప్తున్నాయి. ఆర్థరైటిస్‌లో ప్రధానంగా ఆస్టియో ఆర్థరయిటిస్, రుమ టాయిడ్ ఆర్థరైటిస్ అని రెండు రకాలు ఉంటాయి. వృద్ధాప్యంలో మోకాలు, తుంటి కీళ్ళు అరగటం వల్ల ఆస్టియో ఆర్థరయిటిస్ వస్తుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్‌లో రోగనిరోధకశక్తి ఎదురు తిరగడంవల్ల కీళ్ల దగ్గరున్న కణాలన్నీ ఇన్‌ఫ్లమేషన్‌కి గురై వాచిపోతాయి. చేతులూ వేళ్లూ మణికట్టూ కాళ్లూ ఇలా కీళ్ల భాగాల తోపాటు శరీరంలోని ఇతర కణజాలాలూ కండరాల మీద దీని ప్రభావం ఉంటుంది. దాంతో పిత్తా శయం, ఊపిరితిత్తుల సమస్యలతో పాటు రక్తహీనత, లో బీ1, మలబద్ధకం వంటి సమస్యలు కూడా వస్తాయి. ఇన్ఫెక్షన్ల కారణంగా సోరియాటిక్, సెప్టిక్, థంబ్ వంటి ఇతరత్రా ఆర్థరయిటిస్ వ్యాధులూ వస్తుంటాయి .

ప్రజాదరణ పొందిన అర్బన్ క్రూయిజర్ హైరైడర్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

అత్యంత ప్రజాదరణ పొందిన అర్బన్ క్రూయిజర్ హైరైడర్ అని టయోటా కిర్లోస్కర్ మోటార్, సేల్స్-సర్వీస్-యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్ ప్రీమియం యాక్సెసరీస్ ప్యాకేజీ, స్టయిల్, స్మార్ట్‌నెస్ సౌకర్యంను జోడిస్తుందని తెలిపారు. టాప్ 2 వేరియంట్ లలో జి , వి ఆఫర్‌లలో లభ్యమవుతుందన్నారు. అన్ని డీలర్‌షిప్‌లలో పరిమిత కాలానికి రూ.50,817 విలువైన కాంప్లిమెంటరీ ప్యాకేజీ లభ్యమవుతుందన్నారు. 2022లో విడుదల నాటి నుండి దాని అత్యాధునిక సాంకేతికత, డైనమిక్ పనితీరు, అత్యుత్తమ ఇంధన సామర్థ్యం, స్థిరమైన మొబిలిటీని అందించడంలో టికెఎం నిబద్ధతకు చిహ్నంగా దేశవ్యాప్తంగా వినియోగదారుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని తెలపడానికి తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు. మా కస్టమర్‌లకు మరింత వ్యక్తిగతీకరించిన ప్రీమియం డ్రైవింగ్ అనుభవాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఈ ప్రత్యేక ఆవిష్కరణలో భాగంగా ఈ నెల 31 వరకు దేశంలోని డీలర్‌షిప్‌లలో అందుబాటులో ఉంచబడిన అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్‌ను ఎంచుకునే కస్టమర్ల కోసం రూ 50,817 విలువైన కాంప్లిమెంటరీ ప్యాకేజీని టికెఎం అందిస్తోందని తెలిపారు. అన్ని టయోటా డీలర్‌షిప్‌లలో బుకింగ్‌లు తెరిచి ఉన్నాయన్నారు. వినియోగదారులు కారును ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు https://www.toyotabharat.com/online-booking లేదా వారి సమీప టయోటా డీలర్‌షిప్‌ని సందర్శించాలని మనోహర్ కోరారు.



సబ్సిడీ వంటనూనెలు పంపిణీ చేస్తున్న జెసి బి.నవ్య, ఎమ్మెల్యే గౌరుచరిత

సబ్సిడీ వంటనూనెల కౌంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వంట నూనె సబ్సిడీ కింద అందజేసే ప్రక్రియలో భాగంగా శుక్రవారం నగరంలోని కర్నూలు సిక్యాంపు రైతు బజారులో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి కౌంటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ. 110 లకే పామాయిల్ ప్యాకెట్, రూ.124 లకే సన్ ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లను ప్రజలకు అందజేస్తున్నామన్నారు. ప్రజలు ఇక్కడి నుండి వంట నూనెను తీసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఒ రాజా రఘువీర్ ఎఎస్ఒ రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

పారిశుధ్య కార్మికుల సేవలు భేష్

నగరపాలక కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికుల సేవలు భేష్ అంటూ ఆరోగ్యధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి ప్రశంసించారు. గత నెలలో విజయవాడ వరద సహాయక చర్యల్లో పాల్గొన్న కర్నూలు నగరపాలకలో 200 మంది పారిశుధ్య సిబ్బందికి, ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున వస్త్రాలను విజయవాడ నగరపాలక సంస్థ పంపింది. శుక్రవారం సిబ్బందికి ఆరోగ్యధికారి కె.విశ్వేశ్వర్ రెడ్డి చేతులు మీదుగా కార్మికులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రమేష్ బాబు, వలి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైల మల్లన్నకు పట్టువస్త్రాల సమర్పణ



రాష్ట్ర ప్రభుత్వం తరుపున శ్రీశైల మల్లికార్జున, భ్రమరాంబకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి ఆనం రామనారాయరెడ్డి , ఎమ్మెల్యే బుడ్డారాజశేఖర్‌రెడ్డి, కమిషనర్ సత్యనారాయణ, ఇఒ పెద్దిరాజు

ప్రజాశక్తి - శ్రీశైలం

దసరా మహోత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరుపున దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్య నారాయణలతో కలిసి స్వామి, అమ్మవార్లకు శుక్రవారం పట్టు వస్త్రాలు సమర్పించారు. ముందుగా ఆలయ రాజ గోపురం వద్ద పట్టు వస్త్రాలకు వేద పండితులు, అర్చక స్వాములు మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చారిత్రక ప్రసిద్ధి పొందిన శ్రీశైల క్షేత్రంలో ఎందరో చక్రవర్తులు, రాజులు, రాజకు టుంబీకులు మొదలైన వారు ఆయా ఉత్సవ సందర్భాల్లో శ్రీస్వామిఅమ్మ వార్లకు పట్టువస్త్రాలను సమర్పించే వారని ప్రతీతి. రాష్ట్ర ప్రభుత్వం ఏటా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు, దసరా మహోత్స వాలకు పట్టువస్త్రాలను ఆనవాయితీగా సమర్పిస్తోంది. సిబ్బది ఆలయ పర్యాదలతోస్వాగతం పలికారు.

పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఆయుధ పూజ

జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులు , సిబ్బందికి విజయ దశమి శుభాకాంక్షలు

కర్నూలు ఎస్‌పి జి. బిందు మాధవ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులు , సిబ్బందికి కర్నూలు జిల్లా ఎస్‌పి జి. బిందు మాధవ్ శుక్రవారం విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంధర్బంగా ప్రతీ ఏటా ఆనవాయితీగా చేపట్టే ఆయుధ పూజను జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో జిల్లా ఎస్‌పి దంపతులు నిర్వహించారు. పోలీసు ఆయుధగారంలో పోలీసులు వినియోగించే ప్రతీ ఆయుధాన్ని అలంకరించారు. దుర్గాదేవి చిత్రపటానికి, జమ్మిచెట్టుకు, పోలీసు వాహనాలకు పూజలు చేశారు. విజయాలకు చిహ్నామైన ఈ విజయదశమి అన్ని రంగాల్లో అందరికి విజయం చేకూర్చాలని, సుఖ సంతోషాలతో ఆనందంగా దసరా పండుగను జరుపుకోవాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి ఆకాంక్షించారు. సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ ఎం.మహేష్ కుమార్, కర్నూల్ డిఎస్‌పి జె. బాబు ప్రసాద్, ఎఆర్ డిఎస్‌పి శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ సిఐ ప్రసాద్, ఆర్ఐలు నారాయణ, సోమశేఖర్ నాయక్, జావేద్ , పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆయుధపూజ కార్యక్రమంలో కర్నూలు ఎస్‌పి జి. బిందు మాధవ్ దంపతులు

సి బెళగల్ పోలీస్ స్టేషన్లో ఆయుధ పూజ

ప్రజాశక్తి-సి బెళగల్ : సి బెళగల్‌లోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ తిమ్మారెడ్డి, సిబ్బంది సమక్షంలో విజయదశమిని పురస్కరించుకొని ఆయుధ పూజ ఘనంగా చేశారు. రికార్డులకు, ఆయుధాలకు పూజల అనంతరం నేరాలకు దూరంగా ఉండాలని అన్నారు. విజయదశమి సందర్బంగా మండలంలోని ప్రజలకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.



పత్తికొండ ప్రజలకు దసరా శుభాకాంక్షలు


ప్రజాశక్తి-పత్తికొండ: పత్తికొండ నియోజకవర్గ ప్రజలకు పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యామ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, ఆర్‌డిఒ ఎస్.భరత్ నాయక్, డిఎస్‌పి వెంకట్రామయ్య, ప్రభుత్వ డాక్టర్ గైనకాలజిస్ట్ డాక్టర్ కల్పన, సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి విజయదశమి రోజు దసరా పండగ జరుపుకుంటున్న ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. చెడు ఎంత దుర్మార్గమైనదైనా, ఎంత శక్తిమంతమైనదైనా మంచితనానిదే అంతిమ విజయం వరిస్తుందని అన్నారు.

చరిత్ర ఘనం..అభివృద్ధి శూన్యం...

అబ్దుల్ వహబ్ సమాధిని కాపాడుకోరా??

ప్రజాశక్తి -కర్నూలు కల్చరల్

ఘనమైన చరిత్ర కలిగిన వీరుడు అబ్దుల్ వహబ్‌ఖాన్ సమాధి మన కర్నూలులో వున్నా ఆ ప్రాంతాన్ని విహారకేంద్రంగా తీర్చిదిద్దడంలో సంబంధిత శాఖాధికారులు వైఫల్యం చెందారు. చరిత్రలో 16వ శతాబ్ధి నాటికి కర్నూలు విజయనగరం సామ్రాజ్యంలో భాగంగా ఉండేది. 1565లో జరిగిన రాక్షసతంగడి,తళ్ళికోట యుద్ధంలో విజయనగర సామ్రాజ్యం ఓటమి పాలై, పరిపాలకుడు అళియరామరాయలు మరణించడంతో విజేతలైన సుల్తానులు విజయనగర రాజ్యభాగాలను పంచుకున్నారు. కర్నూలు మండలంలోని తూర్పుభాగాలు గోల్కొండ సుల్తాన్‌వాటాకు, పడమటి భాగాలు బీజాపూర్ సుల్తాన్ వాటాకు వచ్చాయి. సుల్తానులు తమ మధ్య చేసుకున్న ఒప్పంద భాగాలను నెరవేర్చుకునేందుకు, వాటిని స్వాధీనం చేసుకునేందుకు గాను చాలా యుద్ధాలే చేయాల్సివచ్చింది. ముఖ్యంగా గోల్కొండ సుల్తానుకు కంభం, కొండవీడు వంటి ప్రాంతాలు లొంగలేదు. శిరివెళ్ళ, చెన్నూరు, నంద్యాల, ముసలిమడుగు తదితర గ్రామాలు ఆయనకు లోబడ్డాయి. వీటికి అంతం పలుకుతూ బీజీపూర్ రాజ్యంలో సామంతుడైన అబ్దుల్ వాహబ్‌ఖాన్ కర్నూలు మీద దండయాత్ర చేసి రామరాయల మనవడైన ఆరవీటి గోపాలరాజును ఓడించి బీజాపూరు వారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఈ విజయానికి పురస్కారంగా బీజాపూరు సుల్తాను వాహబ్ ఖాన్‌ను కర్నూలు సుల్తానుగా ప్రకటించాడు. ఇక్కడే ఆయన మరణించారు. అయితే ఒక సువిశాల ప్రాంతంలో సమాధితో పాటు అందమైన తోట నిర్మించారు. అబ్దుల్ వహబ్ సమాధి నిర్మాణం క్రీ.శ.1620లో జరిగింది. ముఖ్యంగా ఈ కట్టడంలో అబ్దుల్ వహబ్ సమాధితో పాటు అతనికుటుంబ సభ్యుల సమాధులు కూడా ఉన్నాయి. ఈ కట్టడం అలంకరణలో తక్కువ ప్రాధాన్యత ఇవ్వబడినప్పటికి, ఎక్కువ విస్తీర్ణంలో నిర్మాణం చేశారు. ఈ కట్టడంలోని ప్రధానమైన పెద్ద గది ఐదుస్తంభాలు వెడల్పుతో, మూడు విలువంపుముఖముగల చిన్నగదుల పొడవు గల పరిమాణంలో నిర్మించారు. దీనికి పై ఉన్నగది నిర్మాణం మూడు స్తంభాల శీర్షికలు గల వెడల్పు, ఒక విలువంపు గది పొడవును కలిగి ఉంది. అర్ధగోళాకృతిలో ఉన్నటువంటి ఈ సమాధి గుమ్మటం చతురస్రాకారపు కప్పుపై నిర్మించారు. ఈ గుమ్మటం కమల పద్మమునుంచి ఉద్భవిస్తుందా! అన్నట్లుగా దానికి దిగువున చుట్టూ కమల పద్మ రేకులు అలంకరించబడి ఉన్నాయి. గుమ్మటంపైన స్తూపాలు , దానికి సమీపాన వివిధ రూపాలతో అలంకృతమైన పిట్టగోడ నిర్మాణం వుంది. ఆవిధంగా వివిధ భాగాల సమన్వయంతో గుంబజ్ చక్కగా నిర్మించారు. ముఖ్యంగా ఈ కట్టడం రెండు పెద్ద గదులలో ఒక చతురస్రాకారపు గది వుంది. వీటిని పరివేష్టిస్తూ రెండు వైపులా రెండు వరండాలున్నాయి. వెలుపలి వరండాకు రెండు వైపుల ఐదు మరియు మూడు గల విలువంపు ముఖాలున్నాయి. ఈ విలువంపు ముఖాలన్ని సమాన్యమైన ఎత్తును కలిగి ఉన్నప్పటికీ, రెండు ముఖాలు మాత్రం తుక్కువ వెడల్పును కలిగి ఉన్నాయి. అద్భుతమైన పరిమాణాలను ఊహించి, చక్కగా నిర్మించిన ఈ కట్టడం పైభాగన గుంబజ్‌కు నాలుగు వైపులా ఆరు మినారులను సమాన మైన పరిమాణంలో చాల శోభాయమానంగా నిలబెట్టడమే గాకుండా వాటికి అద్భుతమైన చిన్నపిట్టగోడను నిర్మించారు. ఈకట్టడం నిర్మాణంలో మరోక గొప్పవిశిష్టత ఎటువంటి దూలాల ఆధారం లేకుండ సమతల రాతి బండలతో నిర్మించిన ప్రధాన గది పై కప్పు వాస్తుకారుని కళా ప్రతిభను తెలియజేస్తుంది.



కర్నూలు అబ్దుల్‌వహబ్ సమాధి

ముఖ్యమైన విషయం గోడలపైన అద్భుతం గా మలచిన గణితపరమైన , పుష్పాలంకృతమైన వివిధ స్వల్పల్బణ రూపాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఉన్నతంగా, శోభితంగా నిర్మించిన స్తంభాలు వాటిపై భాగాన మూల భాగాలు, జాలాలాంకృతమైన పిట్టగోడలు, గుమ్మటమును కలిగి ఉన్న చిన్నస్తంభాల గదులు , ఎతైన మినారులు మొదలగున్నవి పూర్తి పరిణితి చెందిన, బీజాపూర్ సుల్తాన్ వాస్తు శైలికి నిదర్శనముగా చెప్పవచ్చు. ఈ ప్రాంతం కేంద్రపురావస్తు శాఖ పరిధిలో వుంది.. ఇక్కడి ప్రాంతం ఆలనా పాలన లేక అనాథగా మారిపోయింది.. కనీసం సెక్యూరిటీ కూడా లేకుండా ఉండటంతో ఆటవిడుపు కేంద్రమైంది. సంభందిత అధికారులు చర్యలు చేపట్టాలి.